కర్తవ్యోత్తరించాలి. భయాన్ని వర్జించు. సంశయాల నుంచి విముక్తి పొందు. నా యందు పరిపూర్ణ విశ్వాసం ఉంచి వ్యాపార ధర్మ సంస్థాపనం కోసం కలంపట్టి దున్ను. నీవు నిమిత్త మాత్రుడివి. నీ కర్మకు కర్తను నేను. నేను నీ ఆత్మను. మాయనుంచి విముక్తుడవై ఆత్మను దర్శించు."

జుట్టుపోలిగాడు విశ్వరూపం దాల్చాడు. అతడిలో నిఖిల సాహిత్య వ్యాపార జగత్తు సాక్షాత్కరించింది. అందులో హనుమంతరావు కుడిచేత్తో నవల, ఎడంచేత్తో కథ, కుడికాలుతో వ్యాసం, ఎడంకాలితో పరిశోధన గ్రంథం రచిస్తున్నాడు. నోట్లో కలం పెట్టుకుని పద్యాలు రాస్తున్నాడు. మరొక వంక పత్రికాధిపతులను, పబ్లిషర్లనూ, మంత్రులనూ, కలెక్టర్లనూ కాకా పడుతున్నాడు. సన్మానాలు చేయించుకుంటున్నాడు. రచనలని పొగుడుతూ మారుపేర్లతో పత్రికల్లో వ్యాసాలు రాస్తున్నాడు. దేశభక్తిసాహిత్యం ఉత్పత్తి చేయవలసిన అవసరాన్ని గురించి రచయితల మహాసభలో ఉద్ఘాటిస్తున్నాడు. గత మూడు దశాబ్దాల తెలుగు సాహిత్యాన్ని సమీక్షిస్తున్నాడు. చలన చిత్ర శతదినోత్సవంలో ప్రొడ్యూసర్‌ను స్తోత్రం చేస్తున్నాడు. మంత్రిగారి కూతురి పెళ్ళికి పంచరత్నాలు చదువుతున్నాడు. అకాదమీ బహుమతులందుకుంటున్నాడు. శృంగార రసంమీద థీసిస్సు రాస్తున్నాడు. డాక్టరేట్ స్వీకరిస్తున్నాడు. శిష్యబృందంచేత శుశ్రూష చేయించుకుంటున్నాడు. అభిమానులకు ఆటోగ్రాఫులు ఇస్తున్నాడు. రక్షణనిధి కొరకై తన ఫొటోగ్రాఫును వేలంవేస్తున్నాడు. తెలుగు



సాహిత్య చరిత్రపై ఉపన్యాసాలివ్వడానికి విదేశాలకు వెళ్తున్నాడు. హోటల్లో అభిమాన పాఠకుడు ఇప్పిస్తున్న పెసరట్టు తింటున్నాడు. దుకాణంలో భారీఎత్తున రచనల అమ్మకం సాగిస్తున్నాడు.

హనుమంతరావు ఆత్మజ్ఞానం పొందినవాడై చేతులు జోడించి నమస్కరిస్తూ "మహాత్మా! ఇన్నాళ్ళూ నీ మహిమను తెలుసుకోలేకపోయాను. నన్ను మన్నించి కర్తవ్యం బోధించు" అన్నాడు.

జుట్టుపోలిగాడు ఉపదేశం ప్రారంభించాడు.

"హనుమా! ఇన్నాళ్ళూ నువ్వు పెట్టి

# హాస్యమంతుని విశ్వరూపం

ఐడీ లేకుండా వ్యాపారంచేసి కీర్తి గడించావు. పార్థసారథి పాపమూ అని ఆ కీర్తి కాస్తా మంట గలిసి పోయింది. అప్రతిష్ఠని పునఃప్రతిష్ఠించు కోవాలంటే ఇంకా భారీ ఎత్తున వ్యాపారం సాగించాలి. దీనికి పెట్టుబడి అవసరం. నువ్వు ఇంత కీర్తి గడించిగలిగావంటే అది పత్రికల వలవే కదా. ఆ పత్రికలే ఇప్పుడు నిన్ను చిన్న చూపు చూస్తున్నాయంటే ఇహ నువ్వే ఒక పత్రిక, ప్రెస్సు పెట్టుకోవాలి. అంతకంటే గత్యంతరం లేదు. ప్రపంచంలో ప్రతి రచ యితకీ డబ్బా అవసరం. అది ఎప్పుడూ మోగుతూ ఉండాలి. కొట్టేవాడు లేకపోతే కొట్టుకోవాలి. ఆ మోతనే "కీర్తి" అంటారు పరిభాషలో. డబ్బా ఎంత గట్టిగా మోగితే అంత కీర్తి ఉన్నట్టు లెఖ్ఖ. కేవలం కీర్తి కోసమే ఇంత పెట్టుబడి పెట్టాలా అని గోలపెట్టకు, దీర్ఘకాలికంగా దీనివల్ల ఆర్థిక ప్రయోజనం కూడా ఉంటుంది. ఈ లాభనష్టాలను

వారైతే వేస్తారు, లేకపోతే వెయ్యరు. మూడోరకం సంపాదకులు బంధువుల కథలు స్నేహితుల కథలు, కానుకుల కథలు మాత్రం ప్రచురిస్తారు. నాలుగోరకంవారు తమకు ఏమాత్రం పక్షపాతంలేదని నిరూపించు కోవాలనే దుగ్ధతో కేవలం పరాయివాళ్ళ కథలు మాత్రమే వేస్తారు. ఎంత మంచి కథలయినాసరే పరిచయం ఉన్నవాళ్ళవి వెయ్యరు. ఐదో రకంవాళ్ళు కథలన్నీ కష్టపడి చదివి చెత్తగా ఉన్నవాటిని మాత్రమే ప్రచురిస్తారు. మంచి కథలను ప్రచురించకుండా, తిప్పిపంపకుండా ఊరగాయ పెడతారు. వాటిని ప్రచురిస్తే ఆ రచయితలు గొప్పవాళ్ళైపోతారనివాళ్ళబెంగ. ఆరోరకంవాళ్ళు ఏ వ్యాసమైనాసరే ఉపనిషత్తు శ్లోకంతో ప్రారంభించి "ఓం తత్సత్"తో ముగిస్తే మధ్యలో ఎన్నిబూతులున్నా ప్రచు రిస్తారు. ఏడోరకం సంపాదకుల పాలసీ ఇంకా గొప్పది. వాళ్ళు బాల్యంలో పంపిన రచనల

## వండూరి పార్థసారధి

గురించి ఇప్పుడు కొత్తగా ఏకు పాఠాలు నేర్చ వలసిన అవసరం లేదనుకో."

హనుమాలు ఉవాచ : "నువు చెప్పిన ఐడియా బాగానేవుందికానీ మరి ఒక పత్రికలో పనిచేస్తూ ఇంకో పత్రిక పెట్టుకోకూడదుకదా. బోలెడు పెట్టుబడి పెడుతూ, పైగా నిషేధంలాటి ఉద్యోగంకూడా వదులుకోమంటావా?"

పోలిగాడు ఉవాచ : "అద్బే అదేం అక్కర్లేదు హనుమాలూ. మీ ఆవిడపేరిట పెట్టెయ్యి. అంతమాత్రం లౌక్యం తెలియక పోతే ఎల్లా? నలుగురూ ఏమైనా అనుకుని పోతారన్న చింత మన కేం లేదుకదా. ఇహ పోతే మన పత్రిక పాలసీ విషయం చెబుతాను. సావధానంగా విను. ఈ ఆంధ్రదేశంలో ఏడు రకాల సంపాదకులున్నారు. మొదటిరకంవారు రచనలన్నింటినీ శ్రద్ధగా చదివి బాగాఉన్నవాటిని ప్రచురిస్తారు లేని వాటిని తిప్పిపంపిస్తారు. రెండోరకంవారు రచనలని అసలు చదవరు. రచయిత పేరుచూసి, పలుకుబడి ఉన్న

వృద్ధాప్యంలో ప్రచురిస్తూ ఉంటారు. ఈ లోగా ఆ రచయిత పోలేదు, కీర్తి సంపాదించు కుంటాడు. అప్పుడు "ప్రఖ్యాత రచయిత ఫలానావారు రాసిన కథ" అని దాన్ని ప్రచు రిస్తారు. దాంతో ఆ రచయిత పేరు కాస్తా మట్టికొట్టుకు పోతుంది. అది తను రాసిన కథ అని ఆ రచయితకే జ్ఞాపకం ఉండదు. ఇహ అతను మొర్రోమని మొత్తుకున్నా ప్రయోజనం ఉండదు.

"ఇప్పుడు మనం 3, 5, 7 రకాల పాలసీ లను సమపాళంగా మేళవించుకోవాలి. అంటే సాధ్యమైనంత వరకు అన్నీ మనవాళ్ళ రచనలే పడేట్టుచూడాలి. ఆ రచనలు మన డబ్బామోతకు తోహదం చేసేవిగా ఉండాలి. పొరపాటునకూడా మంచికథ పడకుండా జాగ్రత్తపడాలి. అంతే కాదు; వాటిని జాగ్రత్తగా ఊరగాయ పెట్టాలి. చెత్త కథలలో ప్రచురించగా మిగిలిన వాటిని చిత్తుబుట్టలో తొక్కద్దు. జాగ్రత్తవెయ్యి. ఎందుకంటే ఆ రచయితల్లో ఎవరైనా ముందు

ముందు గొప్పవాళ్ళు కావచ్చు. అప్పుడు వాటిని ప్రచురించి వాళ్ళు తిక్కకుదర్చవచ్చు. ఇదీ మన పాలసీ. ఇక మన పత్రిక పేరు మహోజ్వల జాతీయ వారపత్రిక "జయఢంకా" లేచినుంచుని ఢంకా బజాయించు."

"లేస్తున్నా" అంటూ హనుమంతరావు కళ్ళు తెరిచి లేచి నుంచున్నాడు. ఎదురుగ్గా "జయ ఢంకా" పత్రికా సంపాదకురాలు చీపురుకట్టు తుని కనిపించింది. "నిద్రలేస్తూకూడా కలవ రిస్తారేమిటండీ ఖర్మ" అంది.

హనుమంతరావు ఆరోజే పత్రికల్లో ప్రకటన వేయించాడు. "నిద్రాణమైయున్న ఆంధ్ర జాతిని మేలుకొలపడానికి శరవేగముతో వచ్చు చున్నది "జయఢంకా". మహోజ్వల జాతీయ వారపత్రిక. సంపాదకురాలు: శ్రీమతి గాయత్రీ హనుమంతరావు (ప్రఖ్యాత రచయిత హను మంతరావుగారి సతీమణి). రచయితలకు, పాఠకులకు అపూర్వ అవకాశము. ఏజెంట్లు త్వరపడవలెను. కంపోజింగు పనియందును' పత్రికా నిర్వహణయందును ఉత్సాహముగల వారికి ఉచితముగా శిక్షణ ఇవ్వబడును. ఆంధ్ర దేశములోని అక్షరాస్యులందరినీ రచయితలుగా చేయుట ఈ పత్రిక లక్ష్యము. రచయితలు కాగోరువారికి మహదావకాశము. వెంటనే చందా దారులు కండు."

హనుమంతరావు వారంరోజులు ఆఫీసుకు సెలవుపెట్టి "జయఢంకా" స్థాపనకు ఏర్పాట్లు ప్రారంభించాడు. ఒక పాత ప్రెస్సును చౌకగా కొన్నాడు. పక్కవాటా అద్దెకు తీసుకుని అందులో ఆఫీసు, ప్రెస్సు ఏర్పాటు చేశాడు. ఏజెంట్లను కుదిర్చే ఏర్పాట్లు చేయమని వివిధ పట్టణాల్లోని తన శిష్య బృందాలకు ఉత్తర్వులు జారీచేశాడు. ఇంటి ముందు బోర్డు తగిలించాడు. రచయితలు కాగోరు హైస్కూలు పిల్లలు, పత్రికా నిర్వహణ యందు ఆసక్తిగల నిరుద్యోగులు అతని చుట్టూ తిరుగుతూ, అతని పనులు చేసిపెడుతూ "తగు శిక్షణ" పొందుతున్నారు. పత్రికా సంపాదకు రాలుగా నటించడానికిగానూ ఇంట్లో భార్యకు శిక్షణ ఇస్తున్నాడు. పెద్దమనుషులు వచ్చినప్పుడు



ఎలా స్వాగతం చెప్పాలో, ఎల్లా మర్యాద చెయ్యాలో, ఎలా నవ్వాలో, సిగ్గుపడాలో, భర్తను గురించి ఎలా పొగడాలో తను నటించి చూపుతూ ఆవిడచేత రిహార్సు చేయిస్తున్నాడు. ప్రెస్సుకు ఒక నిరుద్యోగి ఫోర్మన్‌ని చౌకగా కుదిర్చాడు. అతను రచయితలు కాగోరు కుర్ర వాళ్ళకి కంపోజింగ్ నేర్పుతున్నాడు.

పదిహేను రోజుల్లో ఈ సన్నాహాలన్నీ ముగిశాయి. మంచి ముహూర్తం చూసి పత్రికకి ప్రారంభోత్సవం చేశారు. పుర ప్రముఖుల అందరినీ ఆహ్వానించారు. సౌను పాలకోవా, సావు సౌను కాఫీపొడి కొని సుమారు వంద మందికి కాఫీ ఇచ్చారు. కాఫీ రుచినిగురించి ఆలోచించే వ్యవధి ఇవ్వకుండా అతను, అతని భార్య అతిథులను తమ మాటలతో, నవ్వులతో, చలోక్తులతో, వేళాకోళాలతో ఉక్కిరి బిక్కిరి చేశారు. చిన్నవాళ్ళను భుజం తట్టాడు. పెద్ద వాళ్ళకి వినయంగా చిరునవ్వుతో నమస్కా రాలు పెట్టాడు. తోటివాళ్ళని కౌగలించు కొన్నంత పనిచేశాడు. అతని ఆప్యాయతకు అందరూ మగ్ధులైపోయారు. కాఫీ రుచి సంగతి ఎవరూ పట్టించుకోలేదు. తాగేసినతర్వాత ఖాళీ గ్లాసులు చూసి "ఇప్పుడు మనం కాఫీ తాగాం కాబోలు" అనుకున్నారు.

"జయఢంకా" ప్రారంభసంచిక మార్చిలో విడుదలయింది. అందులో శీర్షికల పేర్లు- చిటపట, టపటప, కలంచిందులు, పేగినాదం జీలకర్ర, బుర్రకు మేత, వచనాలోకం, బాల జగత్, (చి)చిత్రజగత్, మనలోమనం, ఫ్యాన్ మెయిల్ వగైరా......

ఈ శీర్షికలన్నింటికీ బొమ్మలు కూడా వేశారు. "చిటపట" అనే దానికి చినుకులు రాలుతున్నట్లు బొమ్మ వేశారు. "టపటప" అనేదానికి రెండు టపాకాయలు వేశారు. "కలం చిందులు" అనే దానికి ఒక కలం, దాని పక్కనే కాసిని (సిరా) చిందులు. వచనాలోకానికి ఒక కుంపటి మీదగిన్నె, అందులోంచి పొగ.

ప్రఖ్యాత రచయిత హనుమంతరావుగారి సీరియల్ నవల ఒకటి ఈ సంచికలో ప్రారంభమయింది. ఆయన బి. ఏ. అనర్హ పట్టా స్వీకరించిన సందర్భంలో నల్లకోటు వేసుకుని తీయించుకున్న ఫోటో ఆ పేజీలో ప్రచురించారు. గాయత్రీదేవి ఒక కథ రాశారు. కథ పక్కనే ఆమె ఫోటో కూడా ప్రచురించారు. వారి చిరంజీవి ఆశాకిరణ్ (8) రచించిన "అగ్గిపుల్ల ఆత్మకథ"ను బాలజగత్‌లో ప్రచురించారు. ఆ కథ పక్కనే కుర్రవాడి ఫోటో వేశారు— కలంపట్టుకుని ఆలోచనా నిమగ్నుడైన ఫోటో. వేరే పేజీలో హనుమంతరావు దంపతులు వివాహంనాడు (బుగ్గన చుక్క, కళ్యాణం బొట్టు వగైరా హంగులతో) తీయించుకున్న ఫోటో వేశారు.

"వచనాలోకం"లో గాయత్రీదేవిగారు "గుత్తివంకాయ కూరచేయు విధానము" వర్ణించారు. వచ్చేవారం "కాకరకాయపులుసుకూర"ను గురించి తెలుపుతామని ప్రకటించారు. "గుత్తివంకాయ కూరంటే మా వారికి ప్రాణం. నా వంటను ఒకటే మెచ్చుకుంటూ ఉంటారు. అసలు ఆ కూర ప్రసిద్ధ రచయితలందరికీ అభిమానమట" అంటూ రాసింది ఆవిడ. కూర చేయుపద్ధతిని ప్రత్యక్షముగా నేర్చుకొనగోరు స్త్రీలు తీరిక వేళలందు తమ ఇంటికి వచ్చి తెలుసుకొనవచ్చునని కూడా ఆవిడరాసింది. ఈ సంచికకు ఒక సంపాదకీయం కూడా ఉంది. భర్తగారి ఉత్సాహ ప్రోత్సాహలతో పత్రికా సంపాదకత్వం చేపట్టానని, పాఠకులు, రచయితల ఆశీర్వాదాలు ఆదరాభిమానాలు అర్థిస్తున్నానని అందులో రాసింది. సమాజంలో స్త్రీలు ప్రముఖ పాత్ర నిర్వహించాలని, చదువుకున్న ప్రతి స్త్రీ రచయిత్రి కావాలని, రచనతోపాటు వంట కూడా శ్రద్ధగా నేర్చుకుని ఉత్తమ గృహిణులుగా పేరుతెచ్చుకోవాలనీ ఆమె ఉద్బోధించింది.

ఇది ఢంకాకాదు డబ్బా అన్నారు ప్రత్యర్థులు. కానీ వాళ్ళ సంఖ్య బహుస్వల్పం. పత్రికను స్త్రీ నిర్వహించడం ఆ జాతి వారందరికీ గర్వకారణమయింది. ఎక్కువభాగం పత్రికలన్నీ వారేకొన్నారు. రసికులు, హనుమంతరావు అభిమానులు అయిన మగపాఠకులు చాలా మంది కొన్నారు. వచనాలోకం శీర్షికను ఆడవాళ్ళు ఏకగ్రీవంగా ప్రశంసించారు. "గాయత్రీదేవి సాహిత్యం ఎంత హోమ్లీగా ఉంది!" అని మెచ్చుకున్నారు మగపాఠకులు. చిరంజీవి ఆశాకిరణ్ ఇంత చిరుతప్రాయమునందే సాహితీరంగ ప్రవేశం చేసినందుకు అందరూ అబ్బురపడ్డారు. తండ్రిని మించిన కొడుకు అవుతాడని ఆశీర్వదించారు. హనుమంతరావుగారి కుటుంబం "సాహితీ కుటుంబం" అని మెచ్చుకున్నారు.


"జయఢంకా" మోత వారంవారానికి పెరిగిపోతోంది. ప్రతి వంటఇంటికీ జయఢంకా ఒక అలంకారం అయింది. ఆడవాళ్లు జయఢంకా దగ్గర పెట్టుకొని గాయత్రీదేవి చెప్పినట్టు వెండిగిన్నెను సోపువాటర్‌తో శుభ్రముగా కడిగి, టర్కీ టవల్‌తో తుడిచి మరీ కుంపటి ఎక్కిస్తున్నారు. పాఠకులాంధ్ర ఆదరాభిమానములను పురస్కరించుకొని గాయత్రీదేవి వంటకాలలో భారీ ఎత్తున రీసెర్చి ప్రారంభించింది. ప్రత్యక్ష శిక్షణకై రోజూ ఇంటికి వచ్చిపోయే పాఠకురాండ్ర సంఖ్య హెచ్చు అయిపోయింది. వచ్చేవాళ్ళు వట్టిచేతులతో రాకుండా అనపకాయలు, కాకరకాయలు, అప్పడాలు, జీలకర్ర, జీడిపప్పు, కిస్‌మిస్‌పళ్ళు తెస్తున్నారు. ఈ వ్యాపారం బాగా లాయితీగనే ఉందనుకున్నారు హనుమంతరావు దంపతులు. వాళ్ళ వంటిల్లు పెద్ద

లాబొరేటరీలా మారింది. ఒక్కొక్కరోజు వంటకూడా పాఠకురాండ్రే చేసి పెడుతున్నారు.

ఇహ ప్రెస్సులో కంపోజింగ్ పనిచేస్తున్న వారంతా రచయితలు కాగోరుతున్న కుర్రాళ్ళే. వాళ్ళు వంతుల వారీగా వచ్చి పనిచేసి పోతున్నారు. పత్రికా నిర్వహణాయందు శిక్షణకోసం వచ్చే వారిచేత ఆఫీసు పనులు చేయించుకుంటున్నాడు హనుమంతరావు. కవర్లమీద అడ్రసులు రాయటం, చందాదారులకి పత్రికలు పంపడం, పోస్టాఫీసు చుట్టూ తిరగడం మొదలయిన పనులన్నీ వాళ్ళే చేస్తున్నారు. పత్రికలను నిర్వహించ దలచుకున్న వారు ముందు ఈ పనుల్లో ఆరితేరాలని హనుమంతరావు వాళ్ళకి ఉపదేశిస్తున్నాడు. విసుగుపుట్టి కొందరు మానేస్తే వాళ్ళ స్థానంలో కొత్త వాళ్ళు వస్తున్నారు. మొత్తానికి దమ్మిడీ ఖర్చులేకుండా అతడు బోలెడు సిబ్బందిని నిర్వహిస్తున్నాడు. ఈ కుర్రాళ్ళ కథలని వంతులవారీగా వారానికొకటి చొప్పున ప్రచురిస్తున్నాడు.

తన సీరియల్ నవల పూర్తికాగానే హనుమంతరావు పెళ్ళాం పేరుతో ఒక "సెక్సు రస ప్రధాన నవల"ను ప్రచురించడం ప్రారంభించాడు. వక్షోజాలు, పిటపిటలు మొదలయిన వర్ణనలను ఇందులో ద్విగుణీకృతం చేశాడు. ఇంత సెక్సు రాసిన రచయిత్రి ప్రపంచ సాహిత్య చరిత్రలోనే లేదని పలువురు ప్రశంసించారు. ఇంత సెక్సుని హరాయించుకోలేక రసిక పాఠకులకు అజీర్తి చేస్తోంది. అయినా ఆమధ్యంతా సంచిక బజార్లో వేడివేడి పెసరట్లలా అమ్ముడుపోతున్నాయి. రసికపాఠకులు ఇంటికి వచ్చి ఆవిడ ఆటోగ్రాఫులు తీసుకువెళ్తున్నారు.

మొదట్లో నాలుగైదువారాలు హనుమంతరావే సంపాదకీయాలు, ఇతర వ్యాసాలు ఆవిడకి రాసిపెట్టాడు. ఈలోగా రచనా వ్యాపారం కిటుకులన్నీ నూరిపోశాడు. "సాహిత్యం అంటే ఇంతేనా! పప్పురుబ్బటంకంటే కష్టమేమీకాదు. ఈ విషయం తెలిస్తే పదేళ్ళక్రిందటే మొదలు పెట్టేదాన్నే" అనుకుంది ఆవిడ. ఆనాటినుంచి తనే స్వయంగా రాయడం మొదలు పెట్టింది. "ఊరగాయి-మావారు" "ఆవకాయి-[illegible]" మొదలయిన వ్యాసాలు దంచేస్తోంది. "మనలో మనం" అనే శీర్షికలో ఆవిడ పాఠకుల ప్రశ్నలకు సమాధానాలిస్తోంది. ఒక పాఠకురాలు "మావారు కాకరకాయకూర సయించదంటారు. అక్కా, ఏం చెయ్యను అక్కాయ్" అంటూ రాస్తుంది. "మీ బావగారూ అదేమాట. నేనేం చేసేది,



ఈ పాగవాళ్ళంతా ఇంతే చెల్లాయ్" అని ఆవిడ సమాధానం రాస్తుంది.

హనుమంతరావు డబ్బామోతను భరించలేక కొందరు ప్రత్యర్థులు "హనుమంతరావుగారూ పత్రికను మీ కోసమే పెట్టుకున్నట్టుందే. అంతా సొంత డబ్బాయే కనిపిస్తోంది" అని మొహం మీదే అడిగేశారు. హనుమంతరావు తడుముకోకుండా, నిర్లక్ష్యంగా" నా కోసం కాకపోతే ఊళ్ళోవాళ్ళకోసం పెట్టుకున్నాననుకున్నారా? ఇంత పెట్టుబడి పెట్టింది సొంత డబ్బాకోసం కాకపోతే, ఇతరులకి డబ్బాకొట్టడం కోసమా? అయినా ఇతరులకి డబ్బాకొట్టవలసిన ఖర్మ నాకేం పట్టింది?" అని చెప్పాడు. ప్రత్యర్థులు దెప్పుళ్ళే తిట్టుకుంటూ వెళ్ళిపోయారు.

రెండు నెలలు తిరిగేసరికి గాయత్రీదేవి ఆ ఊళ్ళో ఒక మహిళా సంఘానికి అధ్యక్షురాలు అయింది. ఊళ్ళో జరిగే సభలకు అధ్యక్షత వహించడం ప్రారంభించింది. ఆవిడకి బోలెడంతమంది శిష్యురాళ్ళు పోగయ్యారు.

హనుమంతరావు ఈ పత్రిక గొడవలోపడి తన అసిస్టెంట్ ఎడిటర్ ఉద్యోగం వదులుకోలేదు. సొంత పత్రికపని అంతా ఆ ఆఫీసులోనే చేసుకుంటున్నాడు. ఎడిటర్ చూసీ చూడనట్టు ఊరుకుంటున్నాడు. ప్రఖ్యాత రచయిత తన క్రింద అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడన్న సంతృప్తి ఒక్కటే ఆయనకు మిగిలింది. పైగా ఇతన్ని బయటికి పంపిస్తే తనకే పోటీగా తయారు కావచ్చు.



శ్రీ హనుమంతరావు అభిమానులు, శ్రీమతి హనుమంతరావు అభిమానులు కలిసి ఒక సంఘంగా ఏర్పడి హనుమజ్జయంతినాడు దంపతులకు సన్మానం చేశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ పలువురు పూలమాలలు వేశారు. ఆవిడకి పట్టుచీర, రవికలగుడ్డ పెట్టారు. అతనికి పట్టుబట్టలు, నటరాజ విగ్రహం ఇచ్చారు. అందమైన అమ్మాయిలు అతని ముఖాన కుంకుమబొట్టు పెట్టి హారతి ఇచ్చారు. ఈ దంపతులు ఆంధ్ర దేశానికే గర్వకారణమనీ, ఇటువంటివారివల్లనే ఆంధ్రసాహిత్యం ఈ స్థాయికి వచ్చిందనీ పలువురు ఉపన్యసించారు. తమ రచనా వ్యాసంగం తమతోనే అంతరించిపోకుండా కుమారుడ్ని కూడా రచయితగా తీర్చిదిద్దుతున్నందుకు దంపతులను అభినందించారు. తన జన్మదినాన ఈ విధంగా సన్మానించినందుకు హనుమంతరావు కృతజ్ఞత తెలియజేశాడు. ఈ గౌరవం కేవలం తనకు మాత్రమే జరిగినట్టుకాదనీ, ఆంధ్ర భాషామ తల్లినే గౌరవించినట్లవుతుందనీ అన్నాడు. ఇకముందు కూడా ఇటువంటి రచనలే చేయగలనని హామీ ఇచ్చాడు.

వ్యాపారేతర రచయితలందరూ ఆ రోజు ఉరిపోసుకు చావాలనుకున్నారు. అలా చస్తే హనుమంతుడికి పట్టాభిషేకం చేసినట్లవుతుందని ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఆ రోజు అందరూ సమావేశమై హనుమంతరావు వర్ధంతి జరిపారు. ఢంకాను బద్దలు కొట్టేవరకు చావకూడదని తీర్మానించుకున్నారు. వెంటనే "జయఢంకా విచ్ఛేదక సంఘం" రూపొందించారు.

హనుమంతరావు ఢంకా నిర్నిరోధంగా మోగుతూనే ఉంది.

(వచ్చే సంచికలో "సువర్ణలాంగూల ప్రదానం")